నేడు 'డయల్ యువర్ డీఎం'

జీడిమెట్ల: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల డిపో పరిధిలో ఆర్టీసీకి సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా ఫోన్ చేసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 9959226150 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వాటర్ ప్లాంట్ల నిర్వాహకులకు నోటీసులు



పాపయ్యయాదవ్ నగర్‌లో నోటీసు అందజేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీం

జగద్గిరిగుట్ట: అనుమతులు లేకుండా నడుపుతున్న వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు అధికారులు నోటీసులు అందించారు. జంట సర్కిళ్ల పరిధిలో కొనసాగుతున్న అక్రమ ప్లాంట్లపై 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీం ఆధ్వర్యంలో మూడు ప్లాంట్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ప్లాంట్ల నిర్వహణలో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆలయంలో చోరీ



దుండిగల్: అమ్మవారి విగ్రహం నుంచి దుండగులు వెండి కవచం, కన్నులు అపహరించిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్ మండలం నాగులూరులోని నల్ల పోచమ్మ ఆలయానికి బుధవారం 9:30 గంటలకు తాళం వేశారు. తిరిగి గురువారం ఉదయం 7 గంటలకు వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లిచూడగా.. నల్ల పోచమ్మ విగ్రహానికి ఉన్న వెండి కవచం, అమ్మవారి వెండి కన్నులు దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఆలయ పూజారి గుర్తించాడు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు



పోలీసులు సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

కుత్బుల్లాపూర్: బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..భజరంగ్‌హల్స్‌కు చెందిన వెంకటేష్(50) అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. 46 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. బ్లాక్ అడ్డా నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

వెన్నెలగడ్డలోని ఓ కిరాణా దుకాణంపై దాడులు నిర్వహించగా 23 బీరు బాటిళ్లు, 33 విస్కీ బాటిళ్లు లభ్యమయ్యాయి. అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న మధుసూదన్‌గౌడ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు.

రేపటి నుంచి పోచమ్మ తల్లి కల్యాణ మహోత్సవం

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌లో పోచమ్మ తల్లి కల్యాణ మహోత్సవాన్ని శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. శనివారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 5 గంటలకు గంగా తెప్పకు బయలు దేరుట, ఆదివారం ఉదయం 6 గంటలకు అమ్మవారికి అలంకారం, 9 గంటలకు అమ్మవారి కల్యాణం , అన్నప్రసాద వితరణ, పట్నాలు, అగ్నిగుండాలు, సోమవారం అమ్మవారి బోనాలు, సాయంత్రం 3 గంటలకు తొట్టెల ఊరేగింపు వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

పరిశీలన సరే.. చర్యలేవీ?

- నాడు వ్యాపారాలను తొలగించాలని అధికారుల ఆదేశాలు
- అయినా చాంబర్లపై కొనసాగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



షాపూర్‌నగర్‌లోని తిరుమల బేకరీ ఎదురుగా జలమండలి చాంబర్‌పై వెలసిన దుకాణాలు

చింతల్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొంతమంది అక్రమార్కులు గోదావరి ప్రధాన పైప్‌లైన్ 3000 డయా నుంచి 1000/800 పైప్‌లైన్ చాంబర్లకు రక్షణ లేకుండా పోతుంది. చాంబర్లపై అక్రమ వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని తమ దందాను మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగిస్తున్నారు. చాంబర్ పై కొంతమంది అక్రమంగా హోటళ్లు, జ్యూస్ సెంటర్లు ఏర్పాటు చేసుకొని చాంబర్ల నాణ్యతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారు. జలమండలి, హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలించిన ప్రయోజనం శూన్యం. గతంలో పరిశీలించి వ్యాపారాలను తొలగించాలని ఆదేశించారు. అయినా వ్యాపారాలు కొనసాగుతున్నాయి.

పట్టించుకోని జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు

షాపూర్ నగర్ తిరుమల బేకరీ ఎదురుగా ఉన్న 1000/800 పైప్‌లైన్ల చాంబర్ పై వేసిన అక్రమ నిర్మాణాలపై మార్చి 5వ తేదీన 'పైప్‌లైన్ చాంబర్ పై యథేచ్ఛగా వ్యాపారాలు' అన్న శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, హైడ్రా, జలమండలికి చెందిన ట్రాన్స్‌మిషన్ అధికారులు చూసి ఎటు తేల్చకుండా వెళ్లారు. మరల 15 రోజులకు గడిచిన తర్వాత మార్చి 18వ తేదీన వాటర్ వర్క్స్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జ్ఞానేందర్ రెడ్డి, వాటర్ వర్క్స్ విజిలెన్స్ సీఐ సురేష్ తమ సిబ్బందితో వచ్చి అక్రమంగా వ్యాపారం చేస్తున్న వాటిని తక్షణమే తొలగించాలని అక్కడి నిర్వాహకులను ఆదేశించారు. దీంతో సదరు నిర్వాహకులు 15 రోజులు గడువు కావాలని కోరారు. దీంతో అధికారులు వెనుతిరిగారు. ఏప్రిల్ 4న ఈ చాంబర్‌ను ట్రాన్స్‌మిషన్ జీఎం రాజశేఖర్, ట్రాన్స్‌మిషన్ డీజీఎం రవి కుమార్లు పరిశీలించారు. వ్యాపారాలను తొలగించాల్సిందిగా హెచ్చరించి వెళ్లారు. కానీ నేటికీ తమ వ్యాపారాలను నడిపిస్తున్నారు.



వ్యాపారాలను పరిశీలిస్తున్న ట్రాన్స్‌మిషన్ జీఎం రాజశేఖర్ డీజీఎం రవికుమార్

తాగునీరు కలుషితమయ్యే అవకాశం

ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల వచ్చే వరద నీరు చాంబర్ల మీదుగా వెళ్లి అందులో చేరుతున్నాయి. ఈ వర్షం నీటికి తోడుగా పైపులైన్ చాంబర్ పై ఏర్పాటు చేసిన మిర్చి బండి, చైనీస్ ఫాస్ట్ ఫుడ్, జ్యూస్ సెంటర్ల వ్యర్థాలు చాంబర్‌లో నేరుగా కలిసే అవకాశం ఉంది. చాంబర్‌లో ఉన్న సుమారు 8 వాల్వులలో ఏ ఒక్కంటికి లీకేజీ ఏర్పడినా ఈ వరద నీటితో పాటు కలిసి నేరుగా రిజర్వాయర్లలో కలిసి నీటి కాలుష్యం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా జలమండలి ట్రాన్స్మిషన్ అధికారులతో పాటు విజిలెన్స్ అధికారులు స్పందిస్తారో?, లేదో? వేచి చూడాల్సిందే.

వనమహోత్సవంలో 70 లక్షల మొక్కలు నాటాలి

అధికారుల సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి సిటీబ్యూరో: వనమహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలను కూడా ఎక్కువగా నాటేలా చూడాలని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వనమహోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ముందుగానే మొదలైనందున ఈసారి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా ముందుగానే అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు.

◆ జిల్లాలోని మున్సిపాలిటీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని, అందుకు అవసరమైన కార్యాచరణ, ప్రణాళికాబద్ధంగా వెళ్లాలని సూచించారు. జిల్లాలో 70.604 లక్షల వరకు మొక్కలను రోడ్లకు ఇరువైపుల, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో విరివిగా నాటి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ మొక్కల్లో పండ్లు, ఔషధ మొక్కలతో పాటు ఈత మొక్కలను తప్పనిసరిగా 10 శాతం నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సంరక్షణ చర్యలు చేపట్టాలి..

మొక్కలను నాటడమే కాకుండా వాటికి రోజూ నీళ్లు అందించడం, ఎరువు తదితర సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు నాటేందుకు సరిపడా స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటిన స్థలాలను జియో ట్యాగింగ్ ద్వారా టీజీఎఫ్‌ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ నమోదు చేయాలని ఆదేశించారు. డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా అటవీశాఖాధికారి జానకీరాం, పర్యాటకశాఖాధికారి శ్రీధర్, ఆర్‌అండ్‌బీఈఈ శ్రీనివాస్‌మూర్తి, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖాధికారి వినోద్‌కుమార్, హౌసింగ్ పీడీరమణమూర్తి, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, అటవీశాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జీవ ఎరువుల వినియోగాన్ని పెంచాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీలత తదితరులు

దుండిగల్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని గురువారం దుండిగల్ మున్సిపల్ భౌరంపేట్‌లో జరిగింది. కార్యక్రమానికి రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీలత హాజరై భూసార పరీక్షల ఉద్దేశం, మట్టి నమూనా పరీక్షల ఆవశ్యకతను వివరించారు. అదే విధంగా యూరియా వాడటం వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకే సేంద్రీయ, జీవ ఎరువుల వినియోగాన్ని పెంచాలన్నారు. మండల వ్యవసాయ అధికారి యాదగిరి వరి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, డైరెక్టర్లు భీమిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, వ్యవసాయ కళాశాల పీహెచ్‌డీ విద్యార్థి కావ్య, ఎంబీఏ విద్యార్థి అలేఖ్య, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

జైహింద్ యాత్రతో కాంగ్రెస్‌లో జోష్

●ర్యాలీ విజయవంతం ●బీజేపీపై నాయకుల విమర్శలు



గాజులరామారం నుంచి కార్యకర్తలతో తరలివస్తున్న కాంగ్రెస్ నేత కూన శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన జైహింద్ యాత్ర కాంగ్రెస్‌లో జోష్ నింపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం గురువారం సాయంత్రం 4.30 గంటలకు బాచుపల్లిలో వీఎన్‌ఆర్ విజ్ఞాన్ జ్యోతి కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు జాతీయ జెండాతో ర్యాలీగా వచ్చి అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. మొదట మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగించి సభ నుండి వెళ్లిపోగా... ఆ తర్వాత మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. మాట్లాడిన కాంగ్రెస్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు చెప్పగానే సభ మొత్తం దద్దరిల్లింది. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి 7 నియోజకవర్గాలకు సంబంధించిన మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, మైనంపల్లి హనుమంత రావు, పార్టీ తరఫున పోటీ చేసిన వారు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి సభ వ్యవహారాలను పర్యవేక్షించారు.

భారీగా తరలిన కార్యకర్తలు

జైహింద్ యాత్ర విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు తీవ్రంగా కష్టపడ్డారు. ఇన్‌చార్జి కొలన్ హనుమంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నర్సారెడ్డి భూపతిరెడ్డి కార్యకర్తలను తలరించేందుకు ఆయా ప్రాంతాల నుంచి ర్యాలీగా తరలివచ్చారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాట్లను చేశారు. అంతకు ముందు కుత్బుల్లాపూర్ , గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో కాంగ్రెస్ నేత కూన శ్రీనివాస్‌గౌడ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి

బాలానగర్: ఫతేనగర్ రైల్వే స్టేషన్‌లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం ఆయన ఫతేనగర్‌లోని రైల్వే స్టేషన్‌ను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, మూసివేసిన మార్గాలను ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే విధంగా పునరుద్ధరించాలని మహిళలు కోరారు. రైల్వే స్టేషన్‌లో రెండు వైపులా రాకపోకలకు అనుగుణంగా ఎస్కలేటర్స్ ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే ఈటల రాజేందర్ రైల్వే ఉన్నతాధికారుతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఇటీవల ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుల కంచి మహేందర్ యాదవ్, కృష్ణా గౌడ్, ఉదయ్ కుమార్, నరేష్, యాదగిరి ఎల్‌బీఎస్ నగర్ అసోసియేషన్ నాయకుడు రాములు, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, రమేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో 15 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఏఈ శ్రావణితో కలిసి గురువారం పరిశీలించారు. కాలనీలో కొన్ని ఇళ్లు తక్కువ ఎత్తులో ఉండటంతో రోడ్డు నిర్మిస్తే ఎత్తు పెరిగి వర్షాకాలంలో ఇబ్బంది అవుతుందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన వరద నీరు ఇళ్లల్లోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకొని సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, మల్లేష్, ముజీబ్, ఫారూఖ్, ఖలీమ్, రాజుగౌడ్, శ్రీను, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మెస్ టెండర్లు అధికారుల అనుకూల వ్యక్తులకేనా?

కేపీహెచ్‌బీకాలనీ: నిబంధలనకు విరుద్ధంగా బిక్స్ డైరెక్టర్, చీఫ్ ఇంజనీరు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తమకు అనుకూలంగ ఉండే ఏజెన్సీలకు జేఎన్‌టీయూహెచ్‌లో మెస్ టెండర్లను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది. టెండర్ నిబంధనల్లో 2019 సంవత్సరం నుంచి తెలంగాణ ప్రభుత్వం ద్వారా పొందిన లేబర్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్ అనుమతులు ఉన్నవారికే టెండర్ మంజూరు చేయాలని నిబంధనలు ఉన్నాయి. సరైన అనుమతులు లేని ఏజెన్సీలకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే అర్హత గల ఏజెన్సీలకు మెస్ టెండర్లు ఇవ్వాలని, లేని పక్షంలో ఎస్‌ఎంఎస్ విధానం హాస్టల్‌లో ప్రవేశపెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్
- టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. 31న నగరంలోని జలవిహార్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవాల సంబురాల పోస్టర్‌ను గురువారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజే)143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ నాయకత్వంలో, మారుతి సాగర్ సారథ్యంలో రజతోత్సవ సంబురాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు సుధీర్ మంకాల, టీయూడబ్ల్యూజే - ఐజేయు సభ్యులు రంగు వెంకటేష్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సుగ్రీవుడు, సీనియర్ జర్నలిస్ట్ కుంట అనిల్‌కుమార్, టీయూడబ్ల్యూజే హెచ్ -143 కుత్బుల్లాపూర్ ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి కృష్ణారెడ్డి, టీఎంజేయు అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మాధవరెడ్డి, రవీందర్ రెడ్డి, గణేష్‌రెడ్డి, రాజిరెడ్డి, రమణ, సంతోష్, సంతోష్‌రెడ్డి, కృష్ణ పంతులు, వెంకటేష్, సాయిలు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మిథనాల్ లైసెన్స్‌దారులు నిబంధనలు పాటించాలి

జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ షేక్ ఫయాజుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ షేక్ ఫయాజుద్దీన్

కుత్బుల్లాపూర్: మిథనాల్ యూనిట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ షేక్ ఫయాజుద్దీన్ అన్నారు. గురువారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో మిథనాల్ లైసెన్స్‌దారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మిథనాల్‌ను నిల్వ చేసే క్రమంలో కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని, సామాన్యులకు అందుబాటులో లేకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో ప్రత్యేక బృందాలతో మిథనాల్ యూనిట్లను పరిశీలిస్తామని, మిథనాల్ సరఫరా విషయంలో నిబంధనలు పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ మాధవయ్య, జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ నర్సిరెడ్డి, 50 మంది మిథనాల్ లైసెన్స్‌దారులు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన



జీడిమెట్ల పేట్‌బషీరాబాద్‌లో గురువారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. 20 నిమిషాల పాటు కురిసిన భారీ వర్షానికి కాలనీలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. కేవలం అర కిలోమీటర్ దూరమైన సుచిత్రలో మాత్రం చినుకు లేదు. -సుభాష్‌నగర్

అధికారులు సమన్వయంతో పని చేయాలి

● పెండింగ్ నాలా పనులు పూర్తి చేయాలి ● బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద్, వివిధ విభాగాల అధికారులు

కుత్బుల్లాపూర్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విపత్తులనైనా ఎదుర్కొనేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో అభివృద్ధి పనులపై ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డిల అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బస్తీలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు నూతన పనులకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పార్కులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఓపెన్ జిమ్‌ల నిర్వహణ, వాటి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. మోడల్ మార్కెట్లను, కమ్యూనిటీ హాళ్లను ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు. జగద్గిరి గుట్ట అవుట్ పోస్ట్ వద్ద ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సిగ్నల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. జగద్గిరిగుట్ట చివరి బస్టాప్‌లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ సిబ్బంది కోసం విశ్రాంతి గదులు, టాయిలెట్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పరికి చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టి సుందరీకరించాలి సూచించారు. భగత్‌సింగ్‌నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో అసంపూర్తి పనులను, టీఎస్‌ఐఐసీ కాలనీలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సూరారం రాజీవ్ గృహకల్ప నుంచి ఎస్.ఆర్.నాయక్ నగర్ వరకు నాలా పనులను అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. చింతల్ ప్రధాన రోడ్డులో పాదాచారులు రోడ్డు దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాపయ్య యాదవ్‌నగర్ నుంచి బాలానగర్ బీబీఆర్ ఆసుపత్రి వరకు నాలా విస్తరణ పనులను చేపట్టాలని ఆదేశించారు. తద్వారా కుత్బుల్లాపూర్‌లో వరద ప్రవాహం సాఫీగా సాగుతుందన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్ విభాగం ఈఈలు లక్ష్మీ గణేష్, కిష్టప్ప, డీఈలు పాపమ్మ, శిరీష, రూపాదేవి, కార్పొరేటర్లు జగన్, విజయశేఖర్‌గౌడ్, రషీదాబేగం, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, కె.ఎం.గౌరీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన కిరణ్ కుమార్‌కు రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును ఎమ్మెల్యే వివేకానంద్ లబ్ధిదారుడికి అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు విజయ్ హరీష్, లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.